క్లుప్తంగా

ఆత్మీయ వీడ్కోలు



రవికుమార్‌కు వీడ్కోలు పలుకుతున్న జిల్లా పరిషత్ అధికారులు, సిబ్బంది

ఏలూరు(మెట్రో) : బదిలీపై వెళుతున్న జెడ్పీ సీఈఓ రవికుమార్‌కు కార్యాలయ సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ కుక్కునురు, వేలేరుపాడు మండలాల్లో గిరిజనుల, అధికారుల నుంచి పొందిన అనుభవం మరువలేనిదన్నారు. తాను ఎక్కడ పనిచేసినా ఏలూరు నివాసిగానే భావించాలని కోరారు. జిల్లా పరిషత్ పరిపాలనాధికారులు, సిబ్బంది, డ్రైవర్లు, ఆఫీసు సభార్డినేట్లు తనకు అందించిన సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. వారు, ఉద్యోగ సంఘ నాయకులు జి.శ్రీధర్ రాజు శాలువా, పూల బొకెలతో రవికుమార్‌ను సత్కరించారు.

అమృత కలశ యాత్రకు డిగ్రీ విద్యార్థులు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన మేరీ మట్టి – మేరీ దేశ్ కార్యక్రమంలో భాగంగా త్వరలో ఢిల్లీలో నిర్వహించబోయే అమృత కలశ యాత్రకు ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ గుత్తా గిరిబాబు తెలిపారు. అమృత కలశ యాత్రకు ఎంపికైన విద్యార్థులు పి.దుర్గా ప్రసాద్, ఎస్ శ్యామ్ నాగ అచ్యుత్, వి.ఠాగూర్ రాజలను శుక్రవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రత్యేకంగా అభినందించారు. ప్రతిష్టాత్మకంగా నిర్వహించే ఈ యాత్రకు తమ కళాశాల విద్యార్థులు ఎంపిక కావడం తమ కళాశాలకు గర్వకారణమని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. విద్యార్థులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవడానికి ఇదొక మంచి అవకాశంగా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం విజయ కుమార్, అధ్యాపకులు వి.వెంకటరావు, ఎం రాంబాబు, ఎస్ పరమేశ, ఎం కృష్ణ చైతన్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్



బ్రోచర్ విడుదల చేసిన కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ఏలూరు(మెట్రో): స్టార్టప్ ఇండియా పథకం కింద ఎస్సీ, ఎస్టీ కమ్యూనిటీ నుంచి ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు లబ్ధిదారులను గుర్తించి, వారికి ఆయా రంగాల్లో శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం సాయంత్రం ఏర్పాటుచేసిన జిల్లా పరిశ్రమలు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించి మాట్లాడారు. ప్రతి గ్రామపంచాయతీలో యువ కేంద్రాలు ఏర్పాటు చేసి వృత్తి నైపుణ్యం తదితర అంశాలపై శిక్షణ అందించేందుకు జిల్లాలో ఇప్పటివరకు 547 పంచాయతీల నుంచి 482 మంది యువతను గుర్తించామని చెప్పారు. ఈ విషయంలో ఇప్పటికే చొరవ తీసుకున్న డీపీఓను కలెక్టర్ అభినందించారు. మరింత మంది యువతను గుర్తించాలన్నారు.

ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు రూ.23.30 లక్షల రాయితీ

సింగిల్ డెస్క్ పోర్టల్ కింద వివిధ పరిశ్రమల ఏర్పాటుకు ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 180 దరఖాస్తులురాగా, వీటిలో 172 ఆమోదం పొందాయని, మరో అయిదు నిర్దిష్ట కాల పరిమితి పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. వైఎస్సార్ జగనన్న బడుగు వికాసం కింద పెట్టుబడి రాయితీ, విద్యుత్ రాయితీ, సేల్స్ టాక్స్ రాయితీ కింద రూ 23.30 లక్షల రాయితీ సొమ్మును ఏడుగురు ఎంఎస్ఎంఈ పారిశ్రామికవేత్తలకు మంజూరుకు సమావేశం ఆమోదించింది. పీఎంఈజీపీకి సంబంధించి లబ్ధిదారులకు జాప్యం లేకుండా త్వరితగతిన బ్యాంకర్లు రుణాలు అందించేలా చర్యలు తీసుకోవాలని ఎల్‌డీఎంను కలెక్టర్ ఆదేశించారు. పరిశ్రమల స్థాపనపై లభించే ప్రోత్సాహకాలు, అనుమతుల మంజూరు మొదలగు విధి విధానాలపై జిల్లా పరిశ్రమల కేంద్రం ప్రచురించిన అవగాహన బ్రోచర్లలను కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ విడుదల చేశారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం జె.నాగరాజా, డిప్యూటీ డైరెక్టర్ పి.ఏసుదాసు, సిక్కి ప్రతినిధి నారాయణస్వామి, టిక్కీ ప్రతినిధి కె.రాజేంద్ర బాబు, ఏపీఐఐసీ జెడ్ కె.బాబ్జి, ఏపీడీసీఎల్ ఎస్ఈ సాల్మన్ రాజు, డీపీఓ టి.విశ్వనాథ శ్రీనివాస్, ఎల్‌డీఎం నీలాద్రి, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కె.వెంకటేశ్వర్లు, సోషల్ వెల్ఫేర్ జేడీ జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాని హామీతో రోడ్డు నిర్మాణం



సీసీరోడ్డు పనులకు కొబ్బరికాయలు కొడుతున్న ప్రజలు



యుద్ధ ప్రాతిపదికన నిర్మించిన సీసీ రోడ్డు

ఏలూరు రూరల్ : ఎమ్మెల్యే ఆళ్లనాని ఆదేశాల మేరకు కార్పొరేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదిక రోడ్డు నిర్మించారు. ఇటీవల 22వ డివిజన్‌లో ఆళ్ల నాని నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆదర్శనగర్ విద్యానగర్ కనక్టవిటీ రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరారు. దీనిపై స్పందించిన నాని తక్షణం పనులు చేపట్టాలని కార్పొరేటర్, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబుకు సూచించారు. ఫలితంగా శుక్రవారం సీసీరోడ్డు పనులు చేపట్టి పూర్తి చేశారు. పనులను వైఎస్సార్ సీపీ నాయకుడు అనిల్ కుమార్, స్థానికులు పాల్గొన్నారు. దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

దోమల నిర్మూలన సామాజిక బాధ్యత



అరుంధతీపేటలో నీటి తొట్టెను పరిశీలిస్తున్న అధికారులు

ఏలూరు టౌన్: దోమల నిర్మూలన అందరి బాధ్యతగా స్వీకరించి, పరిసరాల పరిశుభ్రత పాటించటం ద్వారా ప్రాణాంతక వ్యాధుల నుంచి కాపాడుకోవచ్చని ఏలూరు అసిస్టెంట్ మలేరియా జె.గోవిందరావు కోరారు. ఏలూరు ఆముదాల అప్పలస్వామి కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలో అరుంధతీపేటలో ఫ్రైడె – డ్రై డే కార్యక్రమం నిర్వహించారు. యూపీహెచ్‌సీ వైద్యాధికారి హర్ష ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బందితో కలిసి వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రజలకు దోమల వల్ల సంక్రమించే రోగాలపై అవగాహన కల్పించారు. డెంగీ వ్యాధికి కారణమైన ఎడిస్ ఈజిప్ట్, మలేరియా కారక దోమ అనాఫిలస్ మన గృహాల్లో, ఇంటి పరిసరాల్లో నీటి నిల్వ తొట్టెల్లో పెరుగుతాయనీ, వీటిలో ఆడదోమలు చాలా ప్రమాదకరమైనవని వివరించారు. నీటి తొట్టెలు, డ్రమ్ములు, వాడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, పూలకుండీలు, ఎయిర్ కూలర్స్‌ను నిత్యం పరిశుభ్రం చేసుకుంటూ ఉండాలని సూచించారు. మలేరియా జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని ప్రభుత్వ హాస్పిటల్‌కు వెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ఇందిరా, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఆరోగ్య కార్యకర్తలు నీలిమా, హసీనా, ఆశా కార్యకర్తలు జ్యోతి, శ్రీదేవి, సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు రజనీ, శశి, వలంటీర్లు ఉన్నారు.

వృత్తిదారులను ఆదుకోవాలి



చేతి వృత్తిదారుల జిల్లా సమన్వయ కమిటీ సమావేశంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ప్రధాన మంత్రి విశ్వకర్మ కౌసల్య యోజనే పథకంలో ప్రతి వృత్తిదారునికీ 50 శాతం సబ్సిడీతో రుణాలు అందించాలని, బడ్జెట్లో రూ.50 వేల కోట్లు నిధులు కేటాయించాలని ఏపీ చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ ఏలూరు జిల్లా సలమావేశం కోరింది. స్థానిక ఆర్ఆర్‌పేటలోని చేతివృత్తిదారుల జిల్లా కార్యాలయంలో ఏపీ గొర్రెలు మేకల పెంపకం దారుల సంఘం జిల్లా కార్యదర్శి ఆగొల్లు వెంకట కృష్ణారావు అధ్యక్షతన వృత్తిదారుల జిల్లా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కన్వీనర్ పిచ్చుక ఆదిశేషు మాట్లాడుతూ రాబోయే రెండు నెలల్లో నిర్వహించే ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధి పొందడానికే ప్రధానమంత్రి విశ్వకర్మ కౌసల్య యోజన పథకానికి రూ.13 వేల కోట్లు కేంద్రం కేటాయించిందని ఆరోపించారు. ఈ పథకానికి పెద్ద ఎత్తుననిధులు విడుదల చేయాలని కోరుతూ నవంబరు 10 నుంచి 28వ తేదీ వరకు వృత్తిదారులతో సభలు, సమావేశాలు, రౌండ్ టేబుల్ సమావేశాలు, సదస్సులు నిర్వహించనున్నట్టు వెల్లడించారు. నవంబరు 30న జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని తెలిపారు. తొలుత ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఏపీ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోలా రామాంజనేయులు మృతికి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. సమావేశంలో సుందరయ్య గ్రంథాలయ నిర్వాహకులు కంది విశ్వనాథం, జీఎంపీఎస్ నాయకులు ఉక్కుసూరి గోపాలకృష్ణ, గనిగంటి కోటేశ్వరరావు, హరిప్రియ, ఎం.చంద్రశేఖర్, ఆళ్ల సత్యనారాయణ, సాకం కృష్ణబాబు తదితరులు పాల్గొన్నారు.

విజయవాడ సభ కరపత్రం విడుదల



బహిరంగ సభ కరపత్రం విడుదల చేసిన నాయకులు

ఏలూరు (టూటౌన్) : నవంబరు 15న విజయవాడలో సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యాదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. స్థానిక పవరుపేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో బహిరంగ సభ కరపత్రాన్ని ఆయన శుక్రవారం విడుదల చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో రవి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని, ప్రత్యేక హోదా, పోలవరానికి నిధులు, విభజన చట్టంలోని హామీలు అమలు చేయలేదని ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం చెల్లించి ప్రాజెక్టు పూర్తి చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, తెల్లం రామకృష్ణ, జి.రాజు, ఎం.నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, బి.సోమయ్య, జి.నరసింహారావు, పి.రామకృష్ణ, ఎం.జీవరత్నం, తెల్లం దుర్గారావు, జి.వెంకట్రావు, టి.ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాశీకి ఏలూరు శివలింగాలు



పార్థివ శివలింగాలను చూపుతున్న హేలాపురి భక్త బృందం ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వచ్చే కార్తీక మాసంలో కాశీ పుణ్యక్షేత్రంలో నిర్వహించే కోటి పార్థివ శివలింగాల అభిషేకానికి ఏలూరు నుంచి పార్థివ శివలింగాలను పంపుతున్నట్టు హేలాపురి భక్త బృందం ప్రతినిధి కూరాళ్ల రమాదేవి తెలిపారు. శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ కాశీలో తంగిరాల రామచంద్ర సాయి ఆధ్వర్యంలో కోటి పార్థివ శివలింగాల ప్రత్యేక అభిషేక కార్యక్రమం నిర్వహించనున్నట్టు చెప్పారు. స్థానిక నేరెళ్ల రాజా కళ్యాణ మండపంలో ఈ నెల 26 నుంచి శివలింగాలను తమ బృందం తయారు చేస్తోందని, ఈ కార్యక్రమం నవంబర్ 1వ తేదీ వరకు కొనసాగుతుందని, రెండు లక్షల పార్థివ శివలింగాలను కాశీకి పంపుతామని చెప్పారు. కార్యక్రమంలో తవ్వాశిరీష, టి.అపర్ణ, కె.శోభ, చలువాది శారద, సీహెచ్.అరుణ, పీ. మధురిమ, కందుల రూప, వేమా జ్యోతి, బి.శ్యామల, పి.పద్మజ, వై.అరుణ, డి.విజయ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా కృషి

దెందులూరు: రానున్న సాధారణ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయదుందుభి మోగించేలే పార్టీ శ్రేణులంతా కృషి చేయాలని పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఈ నెల 30న దెందులూరు నియోజకవర్గం గోపన్నపాలెంలో నిర్వహించనున్న వైఎస్సార్ సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర, బహిరంగ సభ సన్నాహక సమావేశం శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగున్నరేళ్లల్లో దెందులూరు నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, పథకాల అమలును ప్రజలకు వివరిస్తామని ఆయన తెలిపారు. విద్య, వైద్యం, రైతు మహిళా సంక్షేమానికి పెద్దపీట వేయడం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికే చెల్లిందన్నారు. గత ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు, దెందులూరు నియోజవర్గ ప్రజలకు తాను రుణపడి ఉంటానన్నారు. ఈ సందర్భంగా బస్సు యాత్ర పోస్టర్లను విడుదల చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	10
డీ.తిరుమల ఏలురు బీహెచ్ఈఎల్	22.15	17
ఏలూరు – బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	15
ఏలూరు – తిరుపతి(ఇంద్ర)	19.00	34

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు –బీహెచ్ఈఎల్	21.45	4820	04
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	00
ఏలూరు –బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	00
ఏలూరు – జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	05
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	03
ఏలూరు –ఈసీఐఎల్	22.30	4814	10
ఏలూరు – విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	98512	35
ఏలూరు బీహెచ్ఈఎల్	22.30	98506	13
ఏలూరు –తిరుపతి	16.00	4830	23

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	26	అరటి కాయ (1)	07–10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	90
వంకాయలు (కాంతులు)	24	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	30	ములక్కాడలు	05–10
బెండకాయలు	20	కంద	50
పచ్చిమిర్చి	48	బీట్‌రూట్	44
కాకర కాయలు	22– 28	కీరా దోస	44
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	124
క్యాబేజీ	24	అల్లం	130
క్యారెట్	54	కొత్తిమీర (కట్ట)	28
దొండకాయలు	18	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	54	తోటకూర	10
గోరుచిక్కుడు	30	గోంగూర	06
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	15– 20	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20	చిలకదదుంప	30
		నిమ్మకాయలు (డజను)	--

31న ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం



కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు

ఏలూరు (టూటౌన్) : ఈనెల 31న ఏఐటీయూసీ 104వ వ్యవస్థాపక దినోత్సవాన్ని అన్ని ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించాలని యూనియన్ ఏలూరు జిల్లా కన్వీనర్ బండి వెంకటేశ్వరరావు పిలుపు నిచ్చారు. స్థానిక కోటదిబ్బ ఎస్ఆర్ వన్ వద్ద ది.జోనల్ మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం ప్రచార కార్యక్రమం చేపట్టారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏఐటీయూసీ నాయకత్వాన భారత దేశ కార్మిక ఉద్యోగ వర్గాలకు సాధించి పెట్టిన 44 కార్మిక చట్టాలను మోదీ నాయకత్వాన ఎన్డీఏ ప్రభుత్వం మార్పు పేరుతో కాలరాస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తోన్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాల పైనా, ప్రభుత్వ రంగ సంస్థలన్నీ ప్రైవేటీకరణ చేసే విధానాలపైనా సమర శీల పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ది.జోనల్ మున్సిపల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడుతూ అవుట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ఎంపీ సుబ్బారావు, షేక్ ఆలీ, డి.వెంకటేష్, కె.రామచంద్రరావు, ఎం.ఆదినారాయణ, ఆర్ శ్రీనివాసరావు, పి.చందు,డి.దుర్గా ప్రసాద్, సీహెచ్ హరినాథ్ బాబు, బి.దుర్గారావు,కె.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

దెందులూరు సర్పంచ్‌కి కలెక్టర్ నోటీసు

దెందులూరు: దెందులూరు సర్పంచ్ తోట ఏసమ్మకు కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ శుక్రవారం రెండో సారి నోటీసులు జారీ చేశారు. టీడీపీకి చెందిన సర్పంచ్ తోట ఏసమ్మ, గ్రామ కార్యదర్శి గ్రామ పంచాయతీ పరిధిలోని కోటి రూపాయలకుపైగా నిధులు దుర్వినియోగం చేశారని చిలికి శేఖర్ జగనన్నకు చెబుదాంలో అందించిన ఫిర్యాదుపై జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ విచారణ నిర్వహించి నిధుల దుర్వినియోగం వాస్తవమేనని నిర్ధారించి కలెక్టర్‌కు ఈ–ఫైల్ విధానంలో అందించారు. ప్రభుత్వ నిధులు దుర్వినియోగం చేసిన నేపథ్యంలో చెక్ పవర్ ఎందుకు రద్దు చేయకూడదో వివరణ ఇవ్వాలని కలెక్టర్ మొదటి సారి ఇచ్చిన నోటీసుకు సర్పంచ్ ఏసమ్మ తనకు ఈ విషయం తెలియదని, ఏడవ తరగతి వరకూ చదువుకోవడంతో అంతా కార్యదర్శే చూసుకున్నారని వివరణ ఇచ్చారని డీపీఓ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్నికైన గ్రామ సర్పంచులకు రెండు విడతలుగా పంచాయతీరాజ్ చట్టం, సర్పంచుల విధులు, పంచాయతీ తీర్మానాలు, నిబంధనలపై శిక్షణనిచ్చామని డీపీవో తెలిపారు. దెందులూరు గ్రామ పంచాయతీ నిధులు సుమారు కోటి రూపాయలకుపైగా దుర్వినియోగమయ్యాయని, సర్పంచ్ చెక్ పవర్ రద్దు, పంచాయతీకి దుర్వినియోగమైన సొమ్ము రికవరీ ద్వారా జమ చేయించడం, కలెక్టర్ ఆదేశాల మేరకు కార్యదర్శిపై చర్యలు తీసుకుంటామని డీపీఓ వివరించారు.

సామర్థ్యాలను పెంచుకోవాలి



కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులతో డీఈఓ శ్యాంసుందర్

ఏలూరు (టూటౌన్): కంప్యూటర్ శిక్షణ పొందిన వారంతా తమ శక్తి సామర్థ్యాలను పెంపొందించుకోవాలని డీఈఓ పి.శ్యాంసుందర్ సూచించారు. స్థానిక పవరుపేట ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ పూర్తి చేసుకున్న 28వ బ్యాచ్ విద్యార్థులకు ఆయన శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమానికి కంప్యూటర్ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్ ఎం.లక్ష్మి స్వాగతం పలకగా ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి గుడిపాటి నరసింహారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఈఓ శ్యాంసుందర్ మాట్లాడుతూ ఏవీఆర్ విజ్ఞాన కేంద్రంలో 2019 నుంచి కంప్యూటర్ శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఉపాధి కల్పనకు తన పరిధిలో ప్రోత్సాహం కలిగిస్తానని హామీ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఇతర కోర్సులూ నేర్చుకోవాలని సూచించారు. మేతర అజయ్ బాబు, ఎస్ కస్తూరి రావు, జి.శారద తదితరులు మాట్లాడారు.

ఆక్యుపేషనల్ థెరపీపై అవగాహన



చాటపర్రు పీహెచ్‌సీలో అవగాహన కల్పిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్: ఆక్యుపేషనల్ థెరిపీతో వ్యక్తులు పూర్తిసామర్థ్యాన్ని పెంచుకోవచ్చని ఫిజియోథెరిపిస్ట్ జి.రాంబాబు అన్నారు. వరల్డ్ ఆక్యుపేషనల్ థెరపీ డే సందర్భంగా శుక్రవారం చాటపర్రు పీహెచ్‌సీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శారీరక సమస్యల పరిష్కారానికి ఆక్యుపేషనల్ థెరఫీ ఎంతో మేలు చేస్తుందని రాంబాబు అన్నారు. ఉమా ఎడ్యుకేషనల్, టెక్నికల్ సొసైటీ కో ఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ దివ్యాంగులు, కృత్రిమ అవయవాలు, ఫిజియోథెరపీ, ఆడియాలజీ తదితర సేవలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బాణసంచా అక్రమ తయారీపై చర్యలు



స్వాధీనం చేసుకున్న మందుగుండు సామగ్రితో సీఐ రాజశేఖర్, ఎస్సై లక్ష్మణబాబు

ఏలూరు టౌన్: ఏలూరు నగరంలో అక్రమంగా బాణసంచా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని వన్‌టౌన్ సీఐ ఎన్ రాజశేఖర్ హెచ్చరించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, డీఎస్పీ ఈ.శ్రీనివాసులు ఆదేశాల మేరకు నగరంలో విస్తృత తనిఖీలు చేపడుతున్నామని చెప్పారు. ఏలూరు వన్‌టౌన్ 9వ డివిజన్ మేకల కబేళా ప్రాంతంలోని మహ్మద్ నజీర్ ఇంటిలో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. సురే కారం (పొటాషియం నైట్రేట్) 50 కిలోలు, తారాజువ్వలు 200, సిసింద్రీల మందు అరకిలో నారచుట్టిన కాళీ పేపర్ గొట్టాలు, బాణసంచా మందు కూరే మిషన్లు–2 , ఇతర సామగ్రి స్వాధీనం చేసుకున్నారు. మహ్మద్ నజీర్, 9వ డివిజన్‌కు చెందిన మహ్మద్ బషీర్ అనే ఇద్దరిపై కేసు నమోదు చేశామని సీఐ రాజశేఖర్ తెలిపారు. రానున్న దీపావళికి బాణసంచా నిలువ ఉంచినా చట్టం మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. బాణసంచా తయారీ, నిల్వలపై ఏలూరు పోలీస్ కంట్రోల్‌రూమ్ 112కు లేదా 100కు సమాచారం ఇవ్వాలని కోరారు. వన్‌టౌన్ ఎస్ఐ ఫోన్ నెంబర్ 94407 96605కు తెలియజేయాలని కోరారు.